

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 21 ఏప్రిల్-2025 సంచిక : 11

**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**
**సంస్థాపక సంపాదకత్వం :**
**శ్రీ మాతా శుకవాణి**
**ప్రధాన సంపాదకత్వం :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ**
**ప్రత్యేక సహకారం :**
డా॥ జి.చంద్రారెడ్డి M.A, M.Ed., Ph.D
శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)
శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)
**ప్రచార సారథ్యం :**
శ్రీ బి. గోపీకృష్ణ
శ్రీమతి బులుసు జయ

**సాయివాణి చందా వివరాలు**
2 సంవత్సరాలకు చందా.........రూ॥200/-
10 సం.రాలకు చందా........ రూ॥1000/-

**చిరునామా :-**
**సాయివాణి**
సాయిధామం, బొమ్మల రామవరం మండలం,
యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.
Ph : 9440413455, 9848133565

**Online Donations :**
**SRI SAI SEVA SAMITHI TRUST**
**A/c No.62002652136**
**SBI Keesara Branch,**
**IFSC Code : SBIN 0020639**

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి ........ 2
శ్రీ సాయి నిత్య పారాయణ ........ 7
శాశ్వత ధర్మగోప్త ........ 9
సాయిభక్త దాసగణు ........ 12
జ్ఞానోదయమే జీవనసాఫల్యము 15
ఒక యోగి కథలో నుండి ........ 18
చివరికి మిగిలేది ........ 22
రామ నామమా?రామబాణమా 25
మాతృసంస్థ కబుర్లు ........ 30
సార్వతోభద్ర సాయి మందిర
19వ వార్షికోత్సవం ........ 32

ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.







# మా వాణి



ప్రియ పాఠకులందరికీ సాదర ప్రణామాలు

ఎప్పుడో, ఎక్కడో ఇది చదివిన గుర్తు. మహాభారత యుద్ధం జరుగుతోంది. అభిమన్యుడు పద్మవ్యూహం ఛేదించబోయి మరణించాడు. ధర్మజుడు కృంగిపోయాడు. తాను స్వయంగా పంపించాడు లోపలికి-వాడు తిరిగి రాలేదు. త్రిగర్తపతి సుశర్మ అదే సమయానికి చెలరేగి పాండవ సైన్య సంహారం చేస్తుంటే అటు అతని మీదికి వెళ్లారు అర్జునాదులంతా. అందుచేత అభిమన్యునికి సాయం అందలేదు. దుఃఖంతో వెర్రివాడై అరిచాడు ధ్మరాజు. "ఆ గాండీవం ఎందుకు తగలబెట్టనా?" అని. అర్జునుడు తెల్లబోయాడు. తన గాండీవాన్ని నిందించిన తల ఖండిస్తానని తన ప్రతిజ్ఞ. ఆ మాట అన్నవారు అన్నగారు. ఎలా? అన్నను చంపటం కన్నా ఆత్మాహుతి మేలు గదా! ఆ సమయంలో ఆదుకొన్నాడు కృష్ణుడు.

"నీ కంటే యోగ్యులను, మాన్యులను గట్టిగా నిందిస్తే హత్య చేసినంత పాపం వస్తుంది. అందుచేత ధర్మరాజును గట్టిగా కోప్పడు. దానితో నువ్వు ఆయనను చంపినట్లే అవుతుంది. నీ ప్రతిజ్ఞా నెరవేరుతుంది. ధర్మరాజుకు కీడూ వాటిల్లదు". కృష్ణుని మాటలు వింటూనే అర్జునుడు విరుచుకు పడ్డాడు ధర్మరాజు మీద.

"అసలు నీ మూలంగానే మాకీ కష్టాలు. నీవు జూదానికి దిగకుండా ఉంటే యీ యుద్ధమే వచ్చేది కాదు. బంగారంలాంటి నా బిడ్డ పద్మవ్యూహానికి బలి అయ్యేవాడు కాడు. మేము నీ మాట జవదాటం గదా-అని నీ యిష్టం వచ్చినట్లు మా అందరితో ఆటలాడుకున్నావు"-యీ పంపిణీ మీద నోటికి వచ్చినట్లల్లా మాట్లాడాడు.

అటుపైన కూర్చొని కన్నీళ్లు కార్చసాగాడు. "బావా! పుట్టి బుద్ధెరిగాక మా అన్నగారిని వ్యతిరేకించిగానీ, తూలనాడిగానీ ఎరుగను. ఇలా మాట్లాడి ఆయన మనస్సెంతో గాయపరిచాను. ఈ విషయం అమ్మకు తెలిస్తే నన్ను క్షమించదు. పైగా జ్యేష్ఠభ్రాతను చంపినంత పాపానికి పాల్పడి కూడా యింకా నేను బ్రతకటం అనవసరం. ప్రాయోపవేశం చేస్తాను" అని సిద్ధ మవుతున్నాడు.

మళ్లీ శ్రీకృష్ణుడు అడ్డుపడ్డాడు. "ఆగవయ్యా బాబు! అంత తొందరేం! పరనింద చేశావు. అందునా వృద్ధనింద సాధునింద చేశావు. అందువలన హత్యాపాపం చుట్టుకుంది. దానికిగాను శిక్షగా నీవు ఆత్మహత్య చేసుకో దలచుకున్నావు. అయితే పరనింద ఎలా హత్యా సమ నేరమో, ఆత్మస్తుతి ఆత్మహత్యతో సమానం. ఇప్పుడు నీవు నీ గొప్పతనం గురించి పొగుడుకో. దానితో నీవు మృతసమానుడవైపోయినట్లే" అన్నారు ఆయన. వెంటనే అర్జునుడు తాను ఏఏ వీరులను, ఏఏ రాక్షసులను, ఎక్కడెక్కడ ఎలా ఓడించిందీ వివరించుకుంటూ డబ్బా వాయించుకోసాగాడు. ఒక అర గంటసేపు అలా మోగనిచ్చి కృష్ణుడు ఇకచాలు" అన్నాడు. "ఇప్పుడు నువ్వు చచ్చిపోయావు! ఇక విచారం మానివెయ్యి" అన్నాడు. దానితో సమస్య ముగిసిపోయింది.

పై ఐతిహ్యం వలన ఏం తెలుస్తోంది? సాధునింద, గురునింద, వారిని హత్య చేయడంతో సమానమని, ఆత్మస్తుతి ఆత్మహత్యతో సమానమని తెలుస్తోంది. చాలాసార్లు తెలిసో, తెలియకో మనం యీ పాపాలు చేస్తూ, ఉంటాం. సపత్నేకర్ షేవడే మిత్రులు. షేవడే "లా పరీక్షలో తాను తప్పక పాసవుతాననీ, బాబా ఆశీస్సు తనకున్నదనీ" అన్నాడు. నీకేమీ రాకుండా ఎలా పాసవుతావు? ఈ బాబాలను నమ్మితే మునుగుతావు" అంటూ బాబా గారిని నోటికి పట్టనన్ని మాటలు మాట్లాడాడు సపత్నేకర్. దానివలన తనకేం జరుగుతుందో ఊహించలేకపోయాడు. ఒక్కగానొక్క బిడ్డను





పోగొట్టుకొని, ఏడాదిపాటు విచారించి, తన దోషం తాను తెలుసుకొని, బాబా వారి పాదాలు పట్టుకొన్న తరువాతనే ఆయనకు మళ్లీ సంతానోదయం ప్రాప్తించింది.

దక్షుడు తారలను, సతీదేవిని కన్నతండ్రి. తన ఇష్టానికి వ్యతిరేకంగా సతీదేవి ఈశ్వరుణ్ణి వరించింది. దక్షుడు ఆ దంపతుల మీద చాలా క్రోధం పెంచుకున్నాడు. తన ఇంట మహాయజ్ఞం చేస్తూ పెద్దబిడ్డనూ, అల్లుణ్ణీ మాత్రం పిలువలేదు. పుట్టినింటి మీద మమకారంతో పిలవకపోయినా వెళ్లింది సతీదేవి. దక్షుడు ఆమె అభిమానాన్ని గుర్తించక తన కక్షనే ప్రదర్శిస్తూ పరమేశ్వరుణ్ణి నానామాటలూ తూలనాడాడు. సతీదేవి అతణ్ణి "స్వయం పరమేశ్వరుణ్ణి నిందిస్తున్నావు. దీని ఫలితాన్ని అనుభవించవలసి వస్తుందని" హెచ్చరించింది. దక్షుడు ఇంకా చెలరేగిపోయి తన అల్లుడు కశ్యపుడు ఎంత గొప్పవాడో, చిన్న అల్లుడు చంద్రుడు ఎంతటి సుందరా కారుడో, చివరికి తానెంత మహదైశ్వర్యవంతుడో శతవిధాల వర్ణిస్తూ విర్రవీగిపోయాడు. మనస్తాపం చెందిన సతీదేవి స్వయంకల్పితమైన అగ్నిలో ఆత్మాహుతి చేసుకున్నది. మరునిముషంలో ఏం జరిగింది? పరమశివుని జటాజూటం నుడి వెలువడిన వీరభద్రుడు విజృంభించాడు. చిచ్చరకంటి వాడైన పరమశివుడు స్వయంగా కదిలాడు. దక్షయజ్ఞం ధ్వంసమైంది. కశ్యపుడు శివుడు శరణార్థి కాగా, చంద్రుడు శివుని పాదాల క్రింద పడి ముక్కలయ్యాడు. దక్షుని ఐశ్వర్యంగాని, అక్కడ వున్న అనేకమంది వేద వేత్తల పాండిత్యంగాని, అతన్ని రక్షించలేకపోయింది. చివరికి దక్షుని భార్యలు వేడుకోగా శివుడు అతన్ని విడిచిపెట్టాడు.

చిన్నపిల్లలు ఆటలాడుతూ పైకి ఉమ్మివేస్తారు. అది తిరిగి వారి ముఖానే పడుతుంది. భగవన్నింద, భాగవతనింద కూడా ఆకాశం మీద ఉమ్మి వేయటం వంటివే. మనకు అవసరం వచ్చినపుడు దేవుడికి వెయ్యి రకాల విన్నపాలు చేసుకుంటాం. కోరికలు నెరవేరితే స్వామి వలననే మా పిల్లలకు

ప్రమాదం తప్పింది. మా అమ్మాయికి యీ సంబంధం కుదిరింది, మాకు యీ మేలు కలిగింది అని యిలా చెప్పుకుంటాం. ఏదైనా తీరని కష్టం వచ్చిపడిందీ-ఈ దేవునికి మతి చెడింది, దయ తప్పింది-ఇలా ఆయన నెత్తినే దోషం రుద్దుతాం. గురువుల పట్ల కూడా యిలాగే ప్రవర్తిస్తాం. ఇది మన నైజం.

బాబా చరిత్రలో ఒకచోట బాబాగారు రెండు మేకపిల్లలను కొన్న కథ ఉంది. "అతి తక్కువ ఖరీదు చేసే మేకలను బోలెడంత డబ్బు పోసి కొన్నారు. బాబాగారు తెలివితక్కువ పనిచేశారు" అని భక్తులంతా అనుకొన్నారు. శిష్యులు మాత్రం "ఇందులో ఏదో అంతరార్థం ఉంటుంది" అనుకొని, "ఎందుకలా చేశారో మాకు వివరించరా!" అని అడిగారు. ఇది వివేక పద్ధతి. కానీ మనం సాధారణంగా అవివేకాన పడుతూ ఉంటాం. మన చదువు, సంస్కారం, తెలివితేటలు, చుట్టూ వున్న నలుగురూ మనను ఆకాశానికెత్తడం వగైరా వగైరాలన్నీ కలిసి మన లోలోపల ఒకానొక ఆత్మ విశ్వాసం అంచులు దాటిన అహంకారపు పొరను తెరుస్తాయి. మనం ఆ పొర గుండానే ప్రపంచం అంతటినీ చూస్తాం. మనమైన ఆ కొలతలతోనే సాధువులనూ, సద్గురువులనూ ఏమిటి భగవంతుని కూడా కొలుస్తాం. సాధు పద్ధతి వేరూ, సామాన్య పద్ధతి వేరూను.

ఓ సాధువు నదీస్నానం చేస్తున్నాడు. ఒక తేలు పొరపాటున నదిలో కొట్టుకొస్తూ వుంది. సాధువు దాన్ని తీసి ఒడ్డున వేద్దామన్న సత్సంకల్పంతో దోసిట్లోకి తీసుకొన్నాడు. వెంటనే అది ఆయనను కుట్టింది. బాధతో చటుక్కున వదిలాడు. అంతలోనే ఆదరభావం ఆయన బాధను గెలిచింది. మళ్లీ చటుక్కున తేలును పట్టుకున్నాడు. మళ్లీ అది కరిచింది. సాధువు చేయి విదిలించడంతో మళ్లీ అది నీళ్లలో పడింది. ఇలా ఆయన తియ్యడం, ఇది కుట్టడం ఐదారుసార్లు అయ్యాక ఒడ్డు నుండి ఇదంతా చూస్తోన్న గ్రామీణుడొకడు "ఏమయ్యా! అది కుడుతూనే ఉంది. మళ్లీమళ్లీ నువ్వు





దాని జోలికి పోతున్నావ్?" అని అన్నాడు. దానికి సాధువు "నాయనా! దాని సహజగుణం అది చూపిస్తూ ఉంది. మరి నా సాధుగుణం నేను చూపవద్దూ! అన్నాడు. రామానుజాచార్యులను ఇబ్బంది పెట్టాలని ఒక ధూర్తుడు ఆయన గంగాస్నానం చేసి వచ్చే దారిలో ఒక చెప్పల దండ అడ్డంగా కట్టాడు. అది ఆ ఆచార్యుల వారి తలకు తగిలింది. ఆయన తలెత్తి చూచి "ఆహా! ఈ వేళ ఎంత శుభదినం. ఇందరు భాగవతోత్తముల పాదధూళి దొరికింది" అంటూ సాష్టాంగ నమస్కారం చేశారు ఆ నడివీథి లోనే. అది సాధు లక్షణం.

విద్యాప్రకాశానందగిరి స్వామి వారు ఒకచోట ఇలా అంటారు "స్వాములకు నాలుగు పూటల భోజనం పెడితే ఇక వారు మా ఒద్దికలోనే ఉండాలంటారు జనం" మనం మనవైన మమకారాలనుగానీ, కాంక్షలను గానీ, ఐశ్వర్యాలనుగానీ, ఆడంబరాలనుగానీ వదలలేని వాళ్లం. అలా వదలి వచ్చిన వాళ్లు మనకంటే ఎంతో కొంత త్యాగులు, ఉత్తములే కదా! ఆ వివేకం మనకుంటే వారి నుండి ఏమి నేర్చుకోగలమో ఆలోచిస్తాం గానీ, మరోలా ప్రవర్తించలేం గదా! ఇకమీదట భగవంతుడు మనకు అటువంటి సదసద్వివేక చతురత కలిగించాలనీ, భాగవత సేవ, సద్గురు సేవలలోని అంతరార్థాన్ని గ్రహింపజేయాలని భగవంతుని ప్రార్థిద్దాం.

**దేవుడు అంత దూరంలో ఉన్నాడా?**

**అతడు ఆకాశం పైనా లేడు - పాతాళం క్రిందా లేడు.**

**ఎప్పుడూ అతడు నీ దగ్గరే ఉన్నాడు! ఆయన్ను వెదకటానికి ఎక్కడికి వెళ్ళనక్కరలేదు. మానవ రూపంలో ఉన్న దైవాన్ని చూడు.**

**- 'సాయి సూక్తి సుధ' నుంచి**

# శ్రీ సాయి నిత్య పారాయణ గ్రంథము

## భక్తి పద్య కావ్యము



రచన : "రంగరాయ" బిరుదాంకిత **శ్రీ మండువ రంగారావు**

(గత సంచిక తరువాయి)

## 28.అష్ట కష్టములననుభవించె సుధాముడు

ఆ.వె. అహము గలిగెనేని ఆటంకములు గల్గు
అహము విడువ జయము నందివచ్చు
అహము విడచి సాయి నర్చించ భక్తితో
యిహము పరము గల్గ వెతలు దీరు 1

ఆ.వె. నాకు పెట్టకుండ నక్కి తినగ నీవు
తెలియదనుచు యేల తెలివి లేక
శనగలు తినునట్టి చాదస్త మదియేల
యనుచు పలికె సాయి హేము కపుడు 2

కం. శనగల లీలతో నందరి
కనులను దెరిపించె సాయి కారుణ్యముతోన్
తినునెడ నర్పించి సాయికి
తినవలె పిదపను ప్రసాద తీర్థములనుచున్ 3

ఆ.వె. అన్ని వేళలందు అందరి హృదయాల
అంటిపెట్టియుండు ఆత్మజుండు
ఆర్తి జనుల బ్రోచి యాపదలను గాయు
సాయినాధునెపుడు సంస్మరింతు 4

ఆ.వె. విషయమెద్ది యనుభవించగ మేలగు
యింగితమున నెఱుఁగ నేర్వడునది
గురుని కర్వణంబు గురుతించి చేయగా





చిత్తవృత్తులన్ని చిదుమబడును 5

ఆ.వె. స్వార్థచింతనమున శనగలు మెక్కగా
ఏమి ఫలము గలిగె? నెన్నగాను
అష్టకష్టములకునోర్చె సుధాముడు
కృష్ణకర్వణమున కుడువ లేక 6

ఆ.వె. చించనీకరుడొక చేయి మర్దనమును
వేణుబాయి నడుము వీపునొక్కి
సేవ జేయు నెడల చిలిపి కలహమును
చక్కనైన తీర్పు సాయిజేసె 7

ఆ.వె. తల్లిబిడ్డలిట్లు తప్పగాదని సాయి
ముద్దు పెట్టుకొనిన ముప్పలేదు
హాస్యముట్టిపడగ ఆనంద పడగను
వారి కలహ మిట్లు బాబ దీర్చె 8

తే.గీ. మావిశీబాయి బలమైన మర్ధనమున
సాయి పొత్తి కడుపు తోమ సాగదీసి
ప్రేగులు తెగునంచు నచటి భక్తులెల్ల
గోల జేయగా సటకాను గొట్టి నేల... 9

ఆ.వె. పొత్తి కడుపు లోన పొడిచి కొనుచు తాను
నొక్కుకొనియె సాయి నొప్పి కలుగ
భక్తజనులు వారి భావము తీరుగా
సేవజేయవలెను చింత లేక 10

ఆ.వె. ఎవరితీరు వారు యెన్నియో విధముల
సేవజేయు చుండ్రు చెంత జేరి
వారి వారి విధము బాబకిష్టమగును
యితరులెవరు గూడ నెన్నరాదు 11 **(సశేషం)**



## శ్రీ కృష్ణావతారం

# శాశ్వత ధర్మగోప్త

- రచన : భండారు సదాశివరావుగారు

**(గత సంచిక తరువాయి)**

ఇంతలో ఒక రోజున మార్కండేయ మహర్షి వారిని పరామర్శించ డానికి వచ్చాడు. ఆయన చిరంజీవి. పరమశివుని సాక్షాత్కరించుకున్న పరమయోగి. నిత్యమూ పసితనపు నవ్వుతో ఎప్పడూ పదహారేండ్ల వయసుకు మించనివాడుగా కనిపిస్తాడా మహానుభావుడు. పాండవు లను, ద్రౌపదిని చూచి ఆయన నవ్వాడు. ఆ నవ్వులో శైశవనిర్మలత్వం భాసిస్తుంది.

ధర్మరాజుకు జిజ్ఞాస కలిగింది. 'మహర్షి! ఎందుకలా మమ్మల్ని చూచి నవ్వుతున్నారు?' అని ప్రశ్నించాడు.

'ధర్మరాజా! మిమ్మల్ని చూస్తుంటే నాకు పూర్వపు కథ ఒకటి జ్ఞాపకం వస్తున్నది. అందుకే నవ్వాను'.

త్రేతాయుగంలో రఘుకుల సోముడు శ్రీరాముడు పితృవాక్య పరిపాలన కొరకు పద్నాలుగేండ్లు వనవాసం చేశాడు. అతనితోపాటు అతని అర్ధాంగి, మహాసాధ్వి జనక పుత్రిక సీతాదేవి, తమ్ముడు సుమిత్రానందనుడు లక్ష్మణుడు కూడా వెళ్లారు. చెట్ల బెరడులతో చేసిన ఆచ్ఛాదనాలతో కోదండ పాణియై దండకారణ్యాన్ని రాక్షసుల నుండి ముక్తం చేశాడు. అతని ఇల్లాలు సీతాదేవిని లంకాధీశుడు రావణాసురుడు, హరించి తీసుకొనివెళితే, వానరులను, ఋషులను వెంటతీసుకొని, సముద్రం మీద వారధి కట్టి, లంకా పట్టణాన్ని ముట్టడించి రావణాసురుని అనుచరసమేతంగా రూపు మాపి తన భార్యను తెచ్చుకున్నాడు. అతడు మహాపరాక్రమి. సూర్యుని కాంతికి చీకట్లు తొలగిపోయేటట్లు అతని సన్నిధిలో అధర్మం కనిపించ కుండా పోయేది. ధర్మరాజా! ఏకపత్నీవ్రతుడు ఆ శ్రీరామచంద్రునికాని,





గంగను భువికి తెచ్చి తన పితరులైన సప్త సగరులను తరింపజేసిన భగీరథుని గాని, సత్యం కొరకు రాజ్యాన్ని, ఇల్లాల్ని, చివరకు తన ఏకైక పుత్రుణ్ణి కూడా కోల్పోవడానికి సిద్ధమైన హరిశ్చంద్రుణ్ణిగాని నేటికీ మనం స్మరించుకుంటున్నది. వారి సత్య వాక్పరిపాలన-ధర్మ జీవనోపాసన వల్లనే కదా! వనవాసక్లేశం ముగిసిన తరువాత శ్రీరామచంద్రుడు తన రాజ్యాన్ని పరమాదర్శంగా పరిపాలించాడు. అందుకే ఉత్తమ రాజ్య లక్షణానికి రామరాజ్యం సంకేతంగా నిలిచింది' అంటూ శ్రీరామచంద్రుని కథనూ, భగీరథుని వంశం పరంపరగా సాగించిన తపస్సును, హరిశ్చంద్రాది మహారాజుల గాథలను పాండవులకు వివరించి చెప్పాడు. 'నీవూ, నీ తమ్ములూ ఈ పరమసాధ్వి పాంచాల రాజనందన కూడా అలాంటి కష్టాలనే అనుభవిస్తున్నరయ్యా. శ్రీరామునిలా నీవు కూడా ఈ పుడమిని ధర్మరాజ్యంగా నెలకొల్పుతావు' అని పాండవులను, ద్రౌపదిని ఆశీర్వదిం చాడు. మళ్లీ మరొకసారి వస్తానని వాగ్దానం చేశాడు.

మార్కండేయ మహర్షి పూర్వగాథలను వినిపిస్తుంటే ధర్మరాజు శరీరం పులకరిస్తుండేది. ద్వైతవనం బ్రహ్మలోకమనిపిస్తుండేది. జనన, మరణ భయాలకు చలించని ధీరచిత్తుల, తపస్వుల, సర్వసంగపరిత్యాగుల సాంగత్యంలో ధర్మరాజుకు చిత్తశాంతితోపాటు ఒక విధమైన ఆనందం కూడా కలుగుతుండేది.

కాని ద్రౌపది, భీముల ప్రవృత్తులు వేరు, స్వభావాలు వేరు. ధర్మరాజు పుట్టుకతోటే నిగ్రహం, శాంతి కలవాడు. అది అతని ప్రవృత్తి- స్వభావం. ఆ స్వభావానికి వ్యతిరేకంగా ఏమి జరిగినా చలించిపోతాడు. ఒక పిడికెడు మెతుకులు, ప్రశాంత జీవనం లభిస్తే ముల్లోకాలను పరిపాలించే అధికారాన్నైనా తృణపాయంగా త్యజించగలడు.

కాని ద్రౌపది కారణజన్మురాలు. పూర్వం ద్రోణాచార్యుడు పాంచాల రాజు ద్రుపదుణ్ణి పరాభవించాడు. దాని నాయన సహించలేకపోయినాడు.


తనకొక కూతురు జన్మించాలి. ఆ కూతురు ప్రపంచమంతటిలోనూ సర్వ శ్రేష్ఠుడైన ధనుష్కుణ్ణి పెండ్లాడాలి. ఆ అల్లుని ద్వారా ద్రోణాచార్యునిపై పగ సాధించాలి. అదీ కోరిక. అతడు కోరినట్లు విద్యుల్లేఖలాంటి తైజస లావణ్య మూర్తి జన్మించింది. అలాగే ద్రోణవధ చేయగల పుత్రుడు కూడా కావాలని కోరుకున్నాడు. అలాంటి పుత్రుడూ పుట్టాడు. అతిరథ శ్రేష్ఠులలో ఒకడైనాడు. ద్రోణునిపై తనకు గల పగ, ద్వేషాన్ని పాలుగా పోసి ద్రౌపదిని, దృష్టద్యుమ్నుణ్ణి ద్రుపదుడు పెంచాడు. వారిద్దరికీ ద్రోణ పరాభవమే జీవితధ్యేయమైంది.

స్వయంవరంలో అర్జునుడు మత్స్యయంత్రాన్ని ఛేదించాడు. ద్రౌపది పాండువులైదుగురిని పెండ్లాడింది. అలా పాండవులు ద్రుపదరాజుకు అల్లుళ్లైనారు. పాండవ విరోధులు కౌరవులపక్షాన ద్రోణుడు నిలిచాడు. ద్రౌపది జీవనధ్యేయం ద్రోణ పరాభవమే అయినా, నిండు కౌరవ సభలో తనకు జరిగిన అవమానం, రావణుని చెరలో జనక పుత్రి పొందిన అవమానం లాంటిది. ఆ అవమాన ప్రతీకారంగా రావణాసురుని పది తలలు, ఇరవై చేతులు తెగ్గిపడ్డట్లే దుర్యోధన, దుశ్శాసనాది కౌరవశతం, శకునీ, కర్ణుడూ హతమైపోవాలి. అదే పరాభవజ్వాల ఆమెను నిరంతరం దహిస్తుండేది.

ఒకనాడు పాండవులు ధర్మరాజు కుటీరం ముందు కూర్చుని ఉన్నారు. ద్రౌపది యుధిష్ఠిరుని దగ్గరగా కూర్చుని క్షణం నేలపై చూచి మొదలు పెట్టింది. 'ప్రభూ! రాజసూయ మహాధ్వర్యంలో సార్వభౌములుగా అభిషిక్తులైన మీరు ఈ విధంగా జడధారులై తాపసవేషంలో జీవించడం సహించలేకపోతున్నాము. రాజులు, మహారాజులు, సామంతులు, వీరశ్రేష్ఠులు చుట్టూ కొలువుదీరి, సింహాసనాధిష్ఠులై ధర్మానుశాసనాన్ని చేస్తుండిన మీరు ఈ విధంగా సన్యాసిలా జీవించడం రాజధర్మమా? క్షాత్రధర్మమా? మీ తమ్ముల దురవస్థ చూస్తే గుండె తరుక్కొనిపోతున్నది. ఈ మహాబలుడు, హిమాలయ శృంగంలాంటి వాడు-మహారాక్షసులను మట్టి కరిపించిన భీముడు ఎలా చిక్కిపోయినాడో చూడండి. **(సశేషం)**







# సాయిభక్త దాసగణు

రచన : విజయ కిషోర్

**(గత సంచిక తరువాయి)**

**శిరిడీ మార్ఘే పండరి పూర, సాయిబాబా రమావర ॥**

**శుద్ధ భక్తి చంద్రభాగా, భావపుండలీక జాగా ॥**

(శిరిడీయే నా పుండలీపురము. శ్రీ సాయిబాబాయే సాక్షాత్తు ఆ రమావరుడు (పాండురంగడు). నాలో పుండలీకుని భావం జాగృతమై శుద్ధ భక్తి భావం అనే చంద్రభాగ నది రూపంలో నిరంతరంగా ప్రవహిస్తుంది)

అనే అభంగాన్ని పాడేటప్పుడు తన్ను తను మరచి తన్మయుడై భక్తి భావంతో కంఠం గద్గదమై, దాసగణు కనుల నుండి భక్తి ప్రేమాశ్రువులు ధారగా కారేవని ఎందరో భక్తులు దాసగణు గురించిన తమ స్మృతులలో నెమరువేసుకుంటారు. అంతేకాదు, బాబా తనకు ప్రసాదించిన దివ్యానుభవాలను సహచర భక్తులతో పంచుకునేటప్పడు కూడా దాసగణు పై విధంగానే ఎంతో ఉద్వేగానికి గురయ్యేవాడని ప్రత్యక్షసాక్షులు చెపుతారు. హృదయంలో ఒక ప్రక్క బాబా పట్ల అంతటి భక్తి ప్రపత్తులు! ఇంకొక ప్రక్క తాను ఉత్తమమైన బ్రాహ్మణ వంశజుడనని, సాయి వంటి ముస్లీం ఫకీరు చరణ తీర్థం సేవిస్తే తాను మైలపడిపోతానేమోననే పరమ ఛాందస భావన! దాసగణు హృదయంలో పరస్పర బద్ధ వ్యతిరేకులైన శుద్ధ భక్తి, ఛాందస భావాలకు మధ్య నిరంతరం జరిగిన పోరాటంలో, ఎక్కువ సార్లు ఆ ఛాందస భావమే విజయం సాధించిందని, దాసగణు ఎన్నడూ బాబా చరణ తీర్థాన్ని సేవించకపోవడాన్ని బట్టి మనకు అవగతమవుతుంది.

బాబా ఎన్నడూ ఏ భక్తునికి కూడా ప్రసాదించని విధంగా మరియు మాటల కందని అద్భుతమైన రీతిలో దాసగణు కోరికను తీర్చడం కోసం

తమ చరణాల నుండి పవిత్ర జలాన్ని ప్రవహింపజేసారు. నమ్మశక్యం కాని ఆ లీలను చూసి, అజ్ఞానంధకారాన్ని హరించే కోటి దివ్వెల వెలుగు హృదయంలో ప్రకాశించిన వైనంలో, అత్యంత సంభ్రమాశ్చర్యాలకు లోనై, ఆ జలాన్ని దోసిట్లోకి తీసుకున్న అటువంటి భావాతీత స్థితిలో కూడా, తన లోని ఛాందస భావం బలంగా తన ఉనికిని చూపించింది. దాసగణులోని భక్తి భావంపై విజయం సాధించింది. ఫలితం, దాసగణు ఆ జలాన్ని తలపై చల్లుకున్నాడు కానీ, తీర్థంగా స్వీకరించలేదు.

అదెలా సాధ్యం? అంతటి పారమార్థిక జ్ఞాని అలా ఎలా మరపులో పడతారు? అనే సందేహం సహజంగానే ఈ సందర్భంగా మన మస్తిష్కంలో మెదలాడుతుంది. సందేహ నివృత్తి కోసం, ఇంకొంచెం లోతైన, హేతుబద్ధమైన విశ్లేషణకు పూనుకుందాం!

బ్రాహ్మణ వంశజుడైన తాను, ముస్లీం ఫకీరు చరణ తీర్థాన్ని సేవించడం అనే ఛాందస భావం, మనిషిని ఆవరించియుండే అహంకారం యొక్క ఇంకొక రూపం! అరిషడ్వర్గాలలో ఒకటైన అహంకారం యొక్క ప్రభావం ఆధ్యాత్మికంగా ఎంతటి ఉన్నత స్థితులకు చేరినా ఒక పట్టాన వదలదు. ఆ అహంకారం బాహ్యంగా ప్రదర్శితమౌతున్న రూపాన్ని కాకుండా, ఆ రూపం లోపల ప్రస్ఫుటమవుతున్న భగవత్ తత్వాన్ని దర్శించే ఎరుకను మరుపులో పడేస్తుంది. ఈ సత్యాన్ని వివరంగా విశదపరిచే శ్రీ దత్తాత్రేయునకు చెందిన ఒక పౌరాణిక కథను ఈ సందర్భంగా అవలోకించుదాం.

దత్తాత్రేయుని త్రికరణ శుద్ధిగా సేవించే విష్ణుదత్తు అనే బ్రాహ్మణ వంశానికి చెందిన భక్తుని వలన ఉపకారం పొందిన ఒక రాక్షసుడు, విష్ణుదత్తునికి ఏదైనా ప్రత్యుపకారం చేయదలచి, "ఏం కావాలో" కోరుకోమంటాడు. అప్పుడు విష్ణుదత్తుడు తనకు పెద్దగా కోరికలు లేవని, దత్తాత్రేయుని దర్శనం కలిగించమని కోరుకుంటాడు. అది అంత సులభం కాదనీ, ఎంతో క్లిష్టమైన కార్యం అనీ, మాయను వదిలించుకుంటే కానీ అది సాధ్యపడదని, అయినా సరే తన వంతు ప్రయత్నంగా మూడు





అవకాశాలు ఇప్పిస్తానని రాక్షసుడు విష్ణుదత్తుకు వచనం ఇస్తాడు. మొదటి అవకాశంగా ఆ రాక్షసుడు విష్ణుదత్తుని ఒక కల్లు దుకాణం వద్దకు తీసుకు వెళ్ళి, అక్కడ తాగి తందనాలుడుతున్న ఒక వ్యక్తిని చూపించి, "ఆయనే దత్తాత్రేయుడని, మాయ వలన అలా కనపడుతున్నాడనీ, నీవు వెళ్ళి పాదాలు పట్టుకుని శరణు వేడితే నిజరూపంలో దర్శనమిస్తాడని" చెపుతాడు. కానీ, విష్ణుదత్తుని అహంకారం అందుకు అనుమతించదు. "నా దత్తాత్రేయుడేమిటీ కల్లు దుకాణం వద్ద తాగి తందనాలాడటం ఏమిటి? నేను వెళ్ళి ఆ కడజాతి వాడి కాళ్ళ మీద పడటమేమిటి?" అని నిరాకరిస్తాడు.

రెండవ అవకాశంగా, విష్ణుదత్తుని ఆ రాక్షసుడు ఒక స్మశానం వద్దకు తీసుకుని వెళతాడు. అక్కడ మద్యం మత్తులో ఉన్మాదిగా ప్రవర్తిస్తున్న ఒక కాటి కాపరిని చూసి, "కనిపించేదంతా మాయ అని, అందుకు లోను కావద్దని, ఆయన చరణాలను పట్టుకుని శరణు వేడమని, అప్పుడు నిజ రూపం గోచరమవుతుందని" ఆ రాక్షసుడు ఎంతో అనునయంగా, విశ్వాసం కలిగే విధంగా చెపుతాడు. ఆ రాక్షసుని మాటలకు మెత్తపడి, ఆ కాటికాపరిని సమీపించిన విష్ణుదత్తు, "ఛ, ఛ ఈయన దత్తాత్రేయుడేమిటి" అనే భావంతో, ఆ కాటికాపరి భయంకర రూపాన్ని చూసి భయంతో అక్కడ నుండి వెళ్ళిపోతాడు.

"కనిపించేదంతా మాయ అని, ఆ మాయకు లోను కావద్దని, చరణాశ్రయుడవై శరణు కోరితే నిజరూపంలో దర్శనమవుతాడని" రాక్షసుడు చేసిన సత్యబోధ విష్ణుదత్తుని హృదయంపై బలంగా పనిచేయనారంభించడం వలన విష్ణుదత్తునిలో నిద్రాణమైయున్న వివేకం జాగృతమవుతుంది. అహం మరుగునపడుతుంది. మూడవ అవకాశంగా రాక్షసుడు, విష్ణుదత్తుని తీసుకువెళ్ళి మాంసం విక్రయించే చోట త్రాగి వీరంగమాడుతున్న వ్యక్తిని చూసి, "ఆయనే దత్తాత్రేయుడని" చూపించి, మరలా హితబోధ చేసి పంపిస్తాడు.

**(సశేషం)**

# జ్ఞానోదయమే జీవన సాఫల్యము

- వల్లభనేని కుటుంబరావు

**(గత సంచిక తరువాయి)**

ఓర్పు, సహనం, క్షమ, కరుణ, దయ, ప్రేమ, దానం, సేవ, సహాయం, సత్యం ఇవి సాధనలు చేసి ఇతరులకు ఇవ్వటం ప్రారంభించితే ముక్తి మీ దగ్గరకు వస్తుంది.

కాబట్టి, ద్వేషం, అసూయ, మాత్సర్యం, కోపం, మోహం, అహంకారం, లోభం, హింస మొదలగు వాటి నుండి బయటపడి ముక్తికి సంబంధించిన దైవ సంపదను సంపాదించుటకు సాధనలు చేయండి. రోజూ డైరీ వ్రాసుకోండి. ఈ రోజు నేను అన్నీ మంచివి చేసానా, ఎవరినైనా బాధ పెట్టానా, అది అవసరమా? మరుసటి రోజు క్షమాపణ కోరి, మళ్ళీ అలా చేయకుండా జాగ్రత్త పడండి.

సంపూర్ణ సాత్వికులుగా మారండి. దైవం మీ దరిచేరుతుంది.

అందుకనే శాస్త్రాలు, ఉపనిషత్‌లు ఏం చెబుతున్నాయంటే సంశయాత్మలకు ఎప్పటికి మోక్షం (ముక్తి) రాదని.

అందుకనే భగవద్గీతలో అశంసయం మహాబాహా అంటాడు కృష్ణుడు అర్జునునితో. నేను చెప్పిన వాటి మీద సంశయం వదిలిపెట్టి, ఆచరించు అంటాడు కృష్ణ భగవానుడు.

అలాగే విష్ణు సహస్ర నామాలలో విష్ణువుకి చిన్న సంశయ అనే నామం ఉంది. అంటే ఆయన దేని మీద ఏ మాత్రం సంశయం లేనివాడని అర్థం. ఆత్మ గురించి ప్రఖ్యాత శాస్త్రవేత్తలు ఏమంటున్నారో తెలుసుకుందాం.

నిర్మలమైన మనస్సు, ప్రగాఢమైన విశ్వాసం భగవదనుగ్రహంతోనే మనిషి తనలో ఉన్న ఆత్మను దర్శించుకోగలడని ఐన్‌స్టీన్ అన్నాడు.

సర్ జేమ్స్ ఏమన్నాడంటే, “టైమ్ అండ్ స్పేస్ దాటితేనే ఏకత్వం





లభిస్తుందని”. అంటే శూన్యంలోకి వెళితేనే ముక్తి అంటాడు.

డా॥ లిప్టన్ ఏమన్నాడంటే మన పూర్వీకుల గుణగణాలు, వాళ్ళ జీన్స్ ద్వారా మనకు వస్తాయి. ఉదా :- తల్లి, తండ్రి జీన్స్‌తోనే మనం పుడతాం. వారు వాళ్ళ తల్లిదండ్రుల జీన్స్, ఇవి పరంపరగా వస్తాయి అంటాడు. మనం మన జీన్స్‌ని మార్చుకోవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మనం నూతన మనిషిగా మారవచ్చు.

హెర్రీ బెర్గ్‌సన్ అంటాడు “మోక్షం కావాలంటే సెల్ఫ్ ఎవేర్‌నెస్ (జాగృతి), సెల్ఫ్ ఎనాలసిస్. తనను తాను పరిశీలించుకొనుట, సెల్ఫ్ యాక్షన్ కరక్షన్, తన తప్పలను సరిచేసుకొనుట చేస్తే వస్తుందని అంటాడు.

మనిషి మనస్తత్వం భిన్న రీతి. ఏ ఇద్దరి మనస్తత్వం ఒకటిగా ఉండదు. ఎందుకంటే సృష్టిమూలం అది. పైగా మనిషిని నెగెటివ్‌గా ఆకర్షించినంతగా పాజిటివ్ ఆకర్షించటం కష్టం. ఇదే మాయ, ఇదే సృష్టి.

ప్రపంచంలో రెండే మార్గాలున్నాయి. 1) ప్రీతి మార్గం, 2) శ్రేయో మార్గం. నేటి సమాజంలో నూటికి 90% ప్రీతి మార్గంలో వెళతారు. గురువులు, మహాయోగులు, సన్యాసులు, మహాభక్తులు సంపూర్ణ సాత్వికులు మొదలగువారు మాత్రమే శ్రేయోమార్గాన నడుచుకొంటారు.

మోడరన్ (ఆధునిక) సైన్స్ ఏం చెబుతోందంటే హోల్ ఎగ్జిస్టెన్స్ ఈజ్ ఎనర్జీ విత్ డిఫరెంట్ వైబ్రేషన్స్. యూనివర్స్ ఈజ్ కాస్మిక్ ఎనర్జీ. ఏ మంత్రమైనా కొంత ఫ్రీక్వెన్సీతో ఉన్న సౌండ్ వైబ్రేషన్స్ మనం నిత్యం పఠించితే మంత్ర ఫ్రీక్వెన్సీ కాస్మిక్ ఫ్రీక్వెన్సీతో కలిసి, ఫలితాన్ని పొందుతాము. మంత్ర అర్థం తెలియకుండా మంత్రం జపిస్తే ఫలితం ఉండదు. మంత్రార్థం తెలిసి, సరైన స్వరంతో జపం చేస్తే మంత్ర ఫలితం వస్తుంది. మంత్రం గురువు ద్వారానే నేర్చుకోవాలి.

మంత్రం పనిచేస్తుందా, దీనికి శక్తి ఉన్నదా అనే దాని మీద నేను ప్రయోగం చేసాను. ఎలా అంటే కాలి క్రింద ఉన్న ఒక సాలగ్రామ రాయిని అరచేతిలో పెట్టి ‘ఓం నమో నారాయణ’ అని వేగంగా మంత్రోచ్చారణ

చేస్తే, రాయి గిర్రున తిరిగింది. మంత్రం ఆపితే ఆగింది. నెమ్మదిగా జపిస్తే నెమ్మదిగా తిరిగింది. అంటే మంత్రానికి రాయిని కదిపే శక్తి ఉంది. రాయినే త్రిప్పితే మనిషి మీద కూడా పని చేస్తుంది. ఇది నా గురువుగారి సమక్షం లోనే చేశాను. ఆయన చేసి చూపించారు. ఒక సాలగ్రామ రాళ్లకే ఇలా జరుగుతుంది. అందుకే సాలగ్రామాలు డివైన్ స్టోన్స్ అంటారు.

మంత్ర-మన్ అంటే మనసు, త్ర అంటే సాధన అని.

మంత్రం అంటే మనసును నియంత్రించే సాధన అని అర్థం. శాస్త్రవేత్తల ప్రకారం రోజుకు మనిషికి 60,000 ఆలోచనలు 24 గం.లలో వస్తాయని. వాటిలో కొన్ని మంచివి, కొన్ని నెగిటివ్ ఆలోచనలుంటాయి.

మీకు తెలియకుండానే మీ శరీరంలో నెగిటివ్ మంత్రాలున్నాయి. అవి మీ మేధస్సును, శరీర ఆరోగ్యాన్ని పాడుచేసి, పతనావస్థకు తీసుకొని వెళతాయి. ముందు వాటి నుండి మీరు బయటకు రావాలి.

1) నేను చేయలేను, 2) నా వల్ల కాదు, 3) అది జరిగే పని కాదు, 4) నా ఆరోగ్యం బాగాలేదు, 5) నేను అశక్తుడను, 6) అది నా కర్మ, నేను ఏం చేయలేను, 7) నేను ఇలాగే ఉంటాను, 8) మారటం నా వల్ల కాదు మొదలగునవి.


మంత్రజపం సమయంలో కొన్ని వేల ఆలోచనలు ఆగి, ఒకే భావం మీద మనసు కేంద్రీకరిస్తుంది. మనిషికి విశ్రాంతి, శక్తి లభిస్తాయి. క్లారిటీ వస్తుంది మనసుకు. అలాగే ధ్యానంలో కూడా ఆలోచనలు ఉండవు, ఏ ఆలోచన లేకుండా ఉండడమే ధ్యానం.

బౌద్ధ సన్యాసిని నీ 25 సం.ల అనుభూతి ఏమిటి అని అడిగితే "ఏమీ లేదు, కష్టాలు వస్తున్నాయి, పోతున్నాయి. సుఖాలు వస్తున్నాయి, పోతు న్నాయి, నేను వాటిని సాక్షీభూతంగా చూశాను. నేను వాటిలో లీనమవ్వ లేదు. సాక్షిగానే ఉన్నాను. నేను కష్టపడలేదు, బాధపడలేదు. సుఖపడలేదు. అవన్నీ శరీరానివే. అన్నీ పోయినవి. నేను ఇంకా సాక్షిగా నా జీవితాన్ని చూస్తున్నాను" అన్నాడు. ఇది మనం నేర్చుకోవాల్సింది.

**(సశేషం)**







# ఒక యోగి కథలో నుండీ



శ్రీ శ్యామాచరణ లాహిరీగారి ఇంటికి కొద్దిదూరంలో, గ్వాలా జయ పాల్ భగత్ అనే అతనికి పాలూ పెరుగూ అమ్మే దుకాణం ఉండేది. అతను రోజంతా కూర్చుని పాలూ, పెరుగూ అమ్ముతూ, యోగిరాజ మహారాజుల ఇంటికి ప్రతిరోజూ ఎంతమంది వస్తూ పోతుంటారో చూస్తుండేవారు. ఎంతమంది ఆయన కృప వల్ల ధన్యులవుతున్నారో! మహారాజుల మీద జయపాలుడికి గాఢమయిన గౌరవం ఉండేది. తనలాంటి మామూలు మనిషికి మహారాజుల కృప లభిస్తుందా అని అనుకొంటూ ఉండేవాడు. కానీ సాహసించి ఏమీ చెప్పలేకపోతుండేవాడు. ఒకనాడు జయపాలుడు రోడ్డు మీద వెళ్తున్నాడు. హఠాత్తుగా, మహారాజులు ఎదురుగా వస్తూండడం చూసి భక్తిపూర్వకమయిన వినమ్రతతో వారికి ప్రమాణం చేసి దారి ప్రక్క నుంచున్నాడు. మహారాజులు తిరిగి నమస్కరించి, కొద్దిగా చిరునవ్వు చిందిస్తూ "జయపాల్, నువ్వు రేపు వస్తే నీకు దీక్ష ఇస్తాను" అన్నారు.

జయపాలుడు భక్తితో నమస్కరించి "మహారాజ్‌కీ జయ హో!" అన్నాడు. "మహారాజులు స్వయంగా పిలిచి దయ చూపిస్తున్నారు-వారి ఉపదేశాన్ని పాలించగలనా నేను?" అంటూ ఆనందంలో మునిగి ఆలోచన మొదలుపెట్టాడు.

మర్నాడు సరయిన వేళకు జయపాలుడు వచ్చి కూర్చున్నాడు. దీక్ష తీసుకున్నాడు.

అనంతర కాలంలో పాలూ పెరుగూ అమ్మే ఆ చిన్న కొట్టులోనే జయ పాలుడు చాలా డబ్బు గడించాడని తెలిసింది. భక్త జయపాలుడు ధన ధాన్య సమృద్ధితోనూ, పుత్ర పరివారంతోనూ సంపన్నుడయినప్పటికీ అంతా పిల్లలకు అప్పగించేసి, గంగ ఒడ్డున ఒక గుడిసెలో ఒంటరిగా ఉంటూ ధ్యానంలో మునిగిపోయాడు. జయపాలుడు సాధనలో ఉన్నతస్థాయికి

పెరిగాడు.

ఈ విధంగానే బంగ్లాదేశంలో భాగీరథీ ఒడ్డున ఉన్న ఒక చిన్న పల్లెలో, ఇటుకలు తయారుచేసే బడ్డీలో హితలాల్ సర్కార్ పనిచేస్తుండేవాడు. మామూలు ఆదాయంతోనే ఏదో విధంగా ఇల్లు గడుపుకొంటూ ఉండే వాడు. అయినా అతనిలో పరోపకార ప్రవృత్తి ఉండేది. ఎవరయినా బీద వాళ్ళూ, బాధల్లో ఉన్నవాళ్ళూ ఏదయినా అడిగితే, తన కుటుంబానికి ఉన్న కష్టాలన్నిటినీ మరచి, వెంటనే తన శక్తి కొద్దీ దానం చేస్తుండేవాడు. హితలాల్ ఇంట్లో వాళ్లు అందరూ పనిచేస్తారు. కాని మధ్యమధ్యలో అతని మనస్సు ఎక్కడికి పోతుంటుందో తెలిసేది కాదు. గంగ ఒడ్డున గంటల తరబడి కూర్చుండిపోయేవాడు. అన్ని పనులు చేస్తూనే వున్నప్పటికీ ఏదీ నచ్చేది కాదు. తను ఏం పొందాలని కోరుకుంటున్నాడో కూడా హితలాల్‌కి తెలిసేది కాదు. తన జీవితం అసంపూర్ణంగా ఉండిపోయిందనిపించేది.

హితలాల్ ప్రతిరోజులాగే ఆ రోజు కూడా పనికి వెళ్లాడు. నిర్ణీత పద్ధతిలో తన పనులు తాను చేస్తున్నాడు. ఇంతలో ఆకస్మాత్తుగా అతని భావజగత్తులో ఒక మార్పు వచ్చింది. కారణమేమీ లేకుండానే మనస్సులో చాలా వ్యాకులం కలిగింది. అప్పడనుకున్నాడు. ఇక్కడ ఉండటం వల్ల లాభం లేదు. ఇప్పడే ఎక్కడికయినా వెళ్ళిపోవాలి. అనుకున్నట్టు చెయ్యాలి. కార్ఖానా విడిచిపెట్టి, నడక మొదలుపెట్టాడు హితలాల్. ఎక్కడికి వెళ్లాలో, ఏం చేయాలో ఏమీ తెలియదతనికి. మంత్రముగ్ధుడి మాదిరిగా నడిచిపోతున్నాడు. కాసేపటికి రైల్వేస్టేషన్ చేరుకున్నాడు. బండి నిలబడి ఉంది. ఆ బండి మీద హౌరా స్టేషన్‌కు వచ్చాడు. హితలాల్‌కు ఇదేదీ మనస్సులో లేదు. టిక్కెట్ల గది దగ్గరికి వెళ్లి "ఒక టిక్కెటివ్వండి" అన్నాడు. "ఎక్కడికి వెళ్తారు" అని అడిగాడు టిక్కెట్టు బాబు.

"కొద్ది రూపాయలే వున్నాయి. వీటికి సరిపడే టిక్కెట్టు ఇవ్వండి" అన్నాడు హితలాల్.





నడివయస్సులో వున్న టిక్కెట్టు బాబు ఈ పెద్దమనిషి ఎందుచేతనో వ్యాకులత పడుతున్నట్టున్నాడని-"మీరెప్పడయినా కాశీ వెళ్ళారా?" అని అడిగాడు.

"లేదండి, ఎప్పడూ కాశీ వెళ్ళలేదు" అన్నాడు హితలాల్. దానికి టిక్కెట్టు బాబు చిరునవ్వు నవ్వుతూ "అయితే కాశీ వెళ్ళండి. ఈ డబ్బు కాశీ టిక్కెట్టుకు సరిపోయింది. బాబా విశ్వనాథుడి కృప వల్ల మీకు శాంతి కలుగుతుంది" అన్నాడు.

కాశీలో బెంగాలీ టోలా అనే పేట ఉందని హితలాల్‌కి తెలుసు. అక్కడ చాలామంది బెంగాలీలుంటారు. అతను కాశీ రైల్వేస్టేషన్‌లో దిగి, వాకబు చేసి బెంగాలీ టోలా వైపు బయలుదేరాడు. సన్నటి సందు గుండా వెళ్తున్నాడతను. అలసిసొలసి, ఆకలిదప్పలతో అల్లాడుతున్న హితలాల్ ఎక్కడి కని వెళ్లేది? ఏదీ తెలియదు. నడవాలి కాబట్టి నడిచిపోతున్నాడు. ఆకస్మాత్తుగా ఒక ఇంటి దగ్గర సౌమ్యమూర్తి అయిన ఒక సజ్జనుడు బయటికి వచ్చి తనను పిలుస్తున్నట్లు గమనించాడు. "ఇదిగో ఇలా రండి". హితలాల్ ఆశ్చర్యపోయి, ముందుకు నడిచి ఆయన దగ్గరికి వెళ్లి ఇలా అన్నాడు - "మీరు నన్నెరగరు; నేనూ మిమ్మల్ని ఎరుగను. మరి ఎందుకు పిలిచారు?" ఆ పెద్దమనిషి నవ్వుతూ యిలా అన్నారు "అవన్నీ తరువాత- మీరు అలసిపోయి, ఆకలిగా వున్నారు. ముందు స్నానం చేసి, భోంచేసి, విశ్రాంతి తీసుకోండి"

నా కష్టగాథ యీ పెద్దమనిషికి ఎలా తెలిసిందా అనుకున్నాడు హితలాల్.

హితలాల్ స్నానానికీ, భోజనానికీ, విశ్రాంతి తీసుకోవడానికీ కావలసిన ఏర్పాటు జరిగింది. విశ్రాంతి తీసుకొన్న తరువాత, ఇతరులతో మాట్లాడుతూ ఉండగా, యీయనే మహాత్ముల యోగిరాజ శ్యామాచరణ లాహిరీగారని తెలిసింది. వెనుక, వారి పేరు మాత్రం విన్నాడు.

ఇంతలో శ్యామాచరణులు హితలాల్‌ను తమ గదిలోనికి పిలిపించారు. “మీరు దీక్ష తీసుకొనే సమయం వచ్చింది. అందుకే మిమ్మల్ని ఇక్కడికి తీసుకొచ్చాను” అన్నారు.

హితలాల్ యోగిరాజుల పాదాల మీద వాలాడు. మహాయోగి కృపకు పాత్రుడయి అతడు ధన్యుడయాడు.

యోగిరాజుల పొరుగింట్లో ఉండే చంద్రమోహనుడనే యువకుడు డాక్టరీ పాసయి అప్పడే ఇంటికి తిరిగి వచ్చాడు. చంద్రమోహనుడు రామ మోహనుడి సోదరుడు. ఒకనాడు చంద్రమోహనుడు యోగిరాజులకు ప్రణామం చేసి ఆశీర్వదించమని కోరాడు. వారు అతన్ని దీవించి, ఆధునిక చికిత్సకు సంబంధించిన అనేక విషయాలను గురించి ఇష్టాగోష్టి ప్రారంభించారు. కొత్తగా డాక్టరయిన చంద్రమోహనుడికి ఉత్సాహంలో కొరవ లేదు. ఆధునిక వైద్య శాస్త్రాన్ని గురించి అన్ని విషయాలూ చెప్పడం మొదలు పెట్టాడు. వైద్యశాస్త్రం ప్రకారం, చనిపోయిన వాడికి గుర్తు ఏమిటో తెలుసుకోవాలనిపించింది యోగిరాజులకు.

చనిపోయిన వాడికి గుర్తు ఏమిటో వివరించాడు చంద్రమోహనుడు.

దానికి చిరునవ్వు నవ్వుతూ యోగిరాజులు-“చంద్రమోహన్, నన్ను పరీక్ష చేసి, నేను బతికున్న వాణ్ణో, చనిపోయిన వాణ్ణో చెప్పు!” అన్నారు.

చంద్రమోహన్ పరీక్ష చేశాడు. కాని, నోట మాట రాలేదు. యోగిరాజుల శరీరంలో ఎక్కడా ప్రాణమున్న జాడలేదు. గుండె ఆగిపోయింది. చంద్రమోహనుడికి ఏం చెప్పాలో పాలుపోలేదు. ఉన్నట్టుండి చిరునవ్వు నవ్వుతూ యోగిరాజులు-“అయితే మరి చంద్రమోహన్ నాకు డెత్ సర్టిఫికెట్ రాసి ఇయ్యి” అన్నారు.

చంద్రమోహనుడు సంకటంలో పడ్డాడు. జవాబు ఏం చెప్పాలో అని ఆలోచిస్తున్నాడు. చటుక్కున అతనికొక ఆలోచన తట్టింది. “డెత్ సర్టిఫికెట్ అయితే రాసి ఇస్తాను; కాని, మీరు మాట్లాడుతున్నారు, చనిపోయిన





వాడయితే మాట్లాడలేడు” అన్నాడు.

యోగిరాజులు విరగబడి నవ్వారు-“నువ్వన్నది నిజమే; కాని, మీ ఆధునిక విజ్ఞాన శాస్త్రానికి పైన, తెలుసుకోవలసింది చాలా ఉంది. మీ విజ్ఞాన శాస్త్రానికి అది అందదు. కాని యోగులయినవారు సహజంగానే ఆ జ్ఞానాన్ని అన్వేషించగలరు”.

ఈ సంఘటన చంద్రమోహనుడి జీవితంలో మరువరానిది. అనంతర కాలంలో ఇతను వైద్యుడుగా బాగా సఫలుడయినప్పటికీ ఆధ్యాత్మ మార్గంలో కూడా ముందుకు సాగాడు.

మహనీయుల కృప పున్నమి వెన్నెలలాంటిది. మిట్టపల్లాలూ, జనపద నగరాలూ, కుటీరాలు, గుడిసెలూ అన్న భేదాలు లేకుండా ఆ కరుణ అలా ప్రసరిస్తూ ఉంటుంది. ఎటొచ్చీ మనం హృదయం తెరిచి స్వీకరించ గలగాలి. అంతే.



# చివరికి మిగిలేది

(భవాన్స్ జర్నల్ సౌజన్యంతో)

ఎంచక్కా ఆ వ్యాపారి గారికి నలుగురు భార్యలు. అమ్మా, అయ్యా ఎంచి తెచ్చిన భార్య అతనితో కష్టాలన్నీ పంచుకొన్నాక-సంపద పెరుగుతున్న కొలదీ వ్యాపారిగారు ఒక్కో కొత్త పిల్లను తెచ్చుకొని పెళ్లాడుతూ వచ్చాడు. అందులో అందరికంటే చిన్న చిలకంటే యీయనగారికి మోజెక్కువ. వ్యాపారం మీరు ఎక్కడికి వెళ్లినా రకరకాల వన్నెవన్నెల బట్టలూ, అపురూపమైన నగలూ ఆమె కోసం తెచ్చేవాడు. మూడో భార్య చాలా చక్కనిది. ఆమె తన భార్య అని అందరిలో చూపించుకోవటం అతగాడికి మక్కువగా ఉండేది. కానీ, ఆమె ఎవరి ఆకర్షణలో పడుతుందోనన్న భయం కూడా ఎప్పడూ అతన్ని వెన్నంటే ఉండేది. రెండవ భార్య తెలివి

గలది. వ్యాపార సమస్యలు ఏమి వచ్చినా ఆమె సలహా సంప్రదింపులు ఎంతో ఉపయోగపడతాయి. భర్తకు "కార్యేషు" మంత్రి అన్నట్లుండేది ఆమె. ఇక మిగిలింది పెద్ద భార్య. ఆమె చాలా ధర్మబద్ధంగా నడుచుకొనేది. భర్త పట్ల విధేయత, ఇంటి విషయాలలో మంచి కార్యదక్షత, సొమ్ము పోకుండా కాపాడే నేర్పు-యివన్నీ ఆమెకున్నాయి. కానీ, వ్యాపారికి ఆమె పట్ల ప్రేమ గానీ, ఆకర్షణ గానీ లేనేలేవు.

చాలా ఏళ్లు గడిచిపోయాయి. వ్యాపారి హఠాత్తుగా జబ్బు పడ్డాడు. అది గబగబా ముదిరిపోయింది. అతనికి కడపటి సమయం ముంచుకు వచ్చిందని అర్థమైంది. ఒకరోజు తనలో తాను బాధపడ్డాడు. "నలుగురు భార్యలు వుండి కూడా-నేను ఒంటరిగా పోవాలా!" అనుకున్నాడు. అతడు తనకెంతో ప్రీతిపాత్రురాలైన చిన్నదాన్ని పిలిచాడు. "నేను వెళ్లిపోతున్నాను. నీవు కూడా నాతోపాటే రావూ" ఎంతో దీనంగా అడిగాడు. ఆమెగారు పట్టుచీర చెంగు ఠప్పన విదిలించి "సంబడమే! పోయేవాళ్లతో పోతారా ఎవరైనా!" అంటూ వెళ్లిపోయింది. పాపం గుండెల్లో గునపంతో గుచ్చి నట్లైంది మన వ్యాపారికి. కాస్సేపటికి తేరుకొని -

మూడవ భార్యను పిలిచాడు. "నేను ఎన్నిచోట్ల తిరిగానో అన్నిచోట్లకూ నిన్ను తిప్పాను గదా! ఇప్పుడు-యీ చివరి యాత్రలో కూడా నాకు తోడు రావు" అని అడిగాడు. ఆమె విలాసంగా నవ్వింది. "ఇంత సుందరలోకాన్ని విడిచి, యింత అద్భుతమైన జీవితాన్ని విడిచి నీతో రావాలా? బావుంది. ఎవరికి ఎప్పుడేది ప్రాప్తమో!" అన్నది వాలుజడ వెనక్కు విసురుకుని వెళ్లి పోతూ, వ్యాపారి మరింత కృంగిపోయాడు.

రెండవ దేవేరిని పిలిచాడు. తనతో వచ్చి ఎప్పటిలాగే తోడుండమన్నాడు. ఆమె చాలా విషాదంగా ముఖం పెట్టి "మరోలా అనుకోకండి. ఎన్నోసార్లు మీకు సాయపడగలిగాను కానీ యిప్పుడు ఏమీ చెయ్యలేను. మహా అయితే వల్లకాటి వరకూ రాగలనంతే" అన్నది భారంగా నడిచివెళ్లిపోతూ. వ్యాపారి





కళ్లలోంచి నీళ్లు కారుతున్నాయి. అంతలో ఓ బలహీనమైన కంఠం వినపడింది. "మీరెక్కడికి వెళ్లినాసరే-నేను మీ వెంటనే వస్తాను, బాధపడకండి".

వ్యాపారి తలతిప్పి చూచాడు. మొదటి భార్య నిలబడి వుంది. ఎండి ఒరుగై పోయినట్లుంది. కళాహీనంగా వున్న ఆమెను చూచి, ఎంత అలక్ష్యం చేశాను! నాకు బాగున్నప్పుడు యీమె బాగోగులేవీ చూడక పోతినే!" అని కుమిలిపోయాడు వ్యాపారి. ఏం లాభం! వేళమించి పోయింది.

ప్రియ మిత్రులారా!

ఆ వ్యాపారికే కాదు-మనందరికీ యీ నలుగురు భార్యలూ వున్నారు. మన ముద్దుల భార్య మన శరీరమే. దీన్ని సర్వాంగ సుందరంగా అలంకరించి సంరక్షిస్తాం. మృత్యువు రాగానే మనసు విడిచిపెట్టేది అదే. మన అంతస్తూ, సంపదా, సాధించిన వస్తువులూ యివన్నీ కలిసి మన మూడవ భార్య. మనం దాటిపోగానే యివన్నీ మరెవ్వరినో వరిస్తాయి.

ఇక రెండవ భార్య మన కుటుంబమూ, మన మిత్రులూను. వీళ్లు ఎంత సన్నిహితంగా వున్నా గానీ మనం బ్రతికి వున్నంతవరకే. మహావస్తే కాటి వరకే తప్ప అటుపైన వచ్చే వారెవ్వరూ ఉండరు.

ఇక ఎటొచ్చీ - "నీ వెంట నేనుంటా" అని అనగలిగే తొలి భార్య మన ఆత్మ. మన శారీరక సుఖాలు, ఆనందాలు, బాంధవ్యాలు, ఆర్జనలు-వీటన్నింటి పొంగులో పడి ఆత్మను మర్చిపోతాం. దానికి ఆత్మీయ ఆహారాన్ని ఇవ్వం. అది ఎంతలా నలిగిపోతోందో గ్రహించం. అయినా సరే-మనకు సైదోడు అదొక్కటే.

అంచేత, మిత్రులారా, మన కడపటి క్షణాల వరకూ, అటుపైనా కూడా తోడుగా నిలిచే ఆత్మను క్షణక్షణం గుర్తు పెట్టుకుందాం. మన అసలైన బంధువును తోడుగా వుంచుకుందాం.

# రామ నామమా? రామ బాణమా?

– 'భక్తి కథలు' నుండి

నిరవధిక రామభక్తి చేత మహత్తరమైన కార్యాలను సాధించిన మహనీయుడు హనుమంతుడు. తన శౌర్య బల పరాక్రమాలను పవిత్రమైన రామభక్తికి అంకితం చేసిన పరమభాగవతోత్తముడతడు. శ్రీరాముడి పితృభక్తికి ఏ విధంగాను తీసిపోనిది ఆంజనేయుడి మాతృభక్తి.

శ్రీరామనామ సంకీర్తన ఎక్కడ జరుగుతూన్నా అక్కడ తాను ఉండి భక్తులను అనుగ్రహించే స్వామి ఆంజనేయుడు. శ్రీరాముడికే తన నామ ప్రభావాన్ని తెలిపే హనుమంతుడి మాతృభక్తి గురించిన ఒక చక్కటి కథ ఉంది.

రావణ సంహారానంతరం, రామరాజ్యం ప్రారంభమైనది. అప్పుడు శ్రీరాముడు లోకకళ్యాణార్థం ఒక యాగం చేశాడు.

ఆ యాగంలో అనేకమంది ఋషులు, మునులు పాల్గొన్నారు. అప్పడే వేట ముగించి అలసిసొలసి యాగశాలవైపుకు వచ్చిన శకుంతుడనే సామంతరాజు తనున్న స్థితిలో యాగశాలలోనికి ప్రవేశించడం అనుచితమని భావించి, యాగశాలకు వెలుపల నిలబడి వశిష్ఠాది ఋషులకు నమోవాకాలు చెప్పి నమస్కరించాడు.

సదా వింతగా, విచిత్రంగా యోచించే నారద మహర్షి శకుంతుడి మాటలు విని తక్షణమే కార్యోన్ముఖుడైనాడు.

నారదుడు తిన్నగా విశ్వామిత్ర మహర్షి వద్దకెళ్ళి తను ప్రారంభించబోయే నాటకానికి నాందిగా ఇలా పలికాడు : "ఓ విశ్వామిత్ర మహర్షీ! చూశారా, శకుంతుడనే ఆ సామంతుడు మీ పట్ల ఒనరించిన అపరాధాన్ని నేను భరించలేకున్నాను! వశిష్ఠ మహర్షికి అతగాడు కనబరచిన గౌరవ మర్యాదలు మీ ఎడ చూపలేదు. మీ గౌరవం, తపోమహిమ, నిగ్రహ





అనుగ్రహ శక్తులను అతడు ఎరుగడేమో! వశిష్ఠ మహర్షికి అతగాడు కనబరచిన గౌరవ మర్యాదలు మీ ఎడ చూపలేదు. మీ గౌరవం, తపోమహిమ, నిగ్రహ అనుగ్రహ శక్తులను అతడు ఎరుగడేమో! వశిష్ఠాది మహర్షులకు 'నమస్కారం' అన్నాడు. శ్రీరాముడికి మీరూ గురువే కదా! శ్రీ సీతా కళ్యాణ వైభోగానికి మీ అనుగ్రహమే కదా కారణం! అది ఎరుగక ఆ శకుంతుడు మిమ్మల్ని చులకనగా తలచాడేమో! అందుకేనేమో మీ పేరును ఉచ్ఛరించి ఒక వందనం ఆచరించకపోయాడు!" నారదుడి మాటలు విని విశ్వామిత్రుడు అగ్గి మీద గుగ్గిలమే అయ్యాడు. కళ్ళు అగ్నిగోళాలైనాయి. పెదవులు కోపావేశంతో వణికాయి. కనురెప్పలు నెత్తికెక్కాయి. పళ్లను పటపటా కొరుకుతున్న విశ్వామిత్ర మహర్షి నాసిక వెచ్చని ఊపిరిని బుస్సుమని వదలసాగింది. అతడి ఆగ్రహానికి నారుదుడికే భయం వేసింది.

తక్షణమే నీచాతినీచుడైన ఆ శకుంతుణ్ణి నిర్మూలించి వస్తానని ఉగ్రావతారం ఎత్తి వెళ్ళసాగాడు విశ్వామిత్రుడు!

అప్పుడు నారదుడు, విశ్వామిత్రుణ్ణి వారించి, ఇలా అన్నాడు : "ఓ మహర్షీ! యాగకార్యం జరుగుతూన్న ఈ శుభతరుణంలో ఆగ్రహం యుక్తం కాదు. కాని ఆ శకుంతుణ్ణి శిక్షించే తీరాలి. అందుకే నేనొక ఉపాయాన్ని చెబుతాను, వినండి". పిమ్మట మళ్ళా నారదుడు ఇలా చెప్పసాగాడు : "ఈ శకుంతుడు శ్రీరాముడి అధికారంలో ఉండే సామంతుడు కదా! అందుకని శ్రీరాముడితో యోచించి, శిక్షించండి" అందుకు విశ్వామిత్రుడు అంగీకరించి రాముడికి సంగతి సందర్భాలు తెలిపి, ఆ శకుంతుని శిక్షించి అతగాడి తలను తన పాదాల చెంత పడవెయ్యమని ఆజ్ఞాపించండి.

శ్రీరాముడు గురువు ఆజ్ఞను శిరసావహించి శకుంతుడితో యుద్ధానికి సన్నద్ధుడై, శకుంతుడి రాజ్యంపై దండెత్తి వెళ్ళాడు.

శకుంతుడు తాను ఏ అపరాధమూ ఎరుగనని చెప్పి, దుఃఖించి శ్రీరాముని ఎదిరింప తనకు శక్యం కాదని, తన తలను తీసుకువెళ్ళి ఆ

రామపాదారవిందాలపై పడవేయమని, కత్తితో తన తలను నరుక్కో బోయాడు. అప్పుడు హఠాత్తుగా నారదుడు అతడి చేతిని పట్టుకొని, "ఓరీ పిచ్చివాడా! నువ్వు చెయ్యని అపరాధానికి నిన్ను నువ్వు శిక్షించుకోవడం సబబా! ఈ పిచ్చిప్రయత్నం విరమించు. నేను చెప్పినట్లు నడుచుకో. నీకు రక్షణ కలుగుతుంది" అని చెప్పాడు.

కాస్త ఉత్సాహం కొనితెచ్చుకొని శకుంతుడు ఆశగా నారదుడి కేసి చూసాడు. అప్పుడు నారదుడు ఇలా చెప్పాడు :

"నీ రాజ్యానికి అవతల వైపు ఉండే వనంలో అంజనాదేవి తపస్సు చేసుకొంటున్నది. అక్కడికి వెళ్లి ఆమెను శరణువేడు, ఆమె పరమ దయార్ద్ర హృదయ. మహారామభక్తుడూ, సాటిలేని పరాక్రమ విక్రముడూ ఐన ఆంజనేయుని తల్లి ఆమె! నిన్ను తప్పక ఈ ప్రాణాపాయం నుంచి కాపాడు తుంది. భయ సంశయాలను వీడి తక్షణం అక్కడకు వెళ్ళు".

నారదుడి మాటలు ఆలకించి ఆయనకు శతధా నమస్కరించి శకుంతుడు బయలుదేరాడు. అరణ్యంలో అగ్నిగుండాన్ని రగిలించి, సభక్తికంగా "అంజనాదేవీ! శరణు, శరణు" అంటూ దాన్లో దూకడానికి సిద్ధమయ్యాడు. అప్పుడు కారుణ్యమూర్తి అయిన అంజనాదేవి అక్కడ ప్రత్యక్షమై, "నాయనా! నువ్వెవరివి? నా పేరు చెప్పి శరణు అన్నావు కనుక, నీ క్షేమం ఇప్పుడు నా బాధ్యత. నీకు ఏ లోటూ రాకుండా కాపాడతాను. నీకు దీర్ఘాయువు కలుగుతుంది" అంటూ అభయమిచ్చింది. అప్పుడు ఆమెకు తన వృత్తాంతాన్ని, శ్రీరాముడి ప్రతిజ్ఞ, ఆగ్రహం, దండయాత్రల ఉదంతం సవివరంగా తెల్పి, తనను రక్షించమని ప్రార్థించాడు.

అసలు విషయం తెలుసుకొన్న అంజనాదేవి క్షణకాలం దిగ్భ్రమ చెందింది. కాని ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవడం తన కర్తవ్యంగా నిశ్చయించి, హనుమంతుణ్ణి తలచుకొన్నది.

అంతే! మరుక్షణం ఆ రామభక్తుడు 'రామ్, రామ్' అంటూ నామజపం చేస్తూ అక్కడకు వచ్చి తల్లికి నమస్కరించాడు.





ఆంజనేయుడు తల్లి పిలుపుకు కారణం ఏమిటని అడగ్గా, శకుంతుని వృత్తాంతం అంతా తెలిపి తాను అతడికి శరణమిచ్చిన సంగతి కూడా చెప్పి, తల్లి వాగ్దానాన్ని నిలబెట్టి అతణ్ణి కాపాడవలసిన బాధ్యతను ఆమె హనుమంతుడికి అప్పగించింది. సాటిలేని రామభక్తుడైన హనుమంతుడు "మాతృదేవోభవ" అంటూ, కించిత్తు అయినా జంకక, మాతృవాక్యాన్ని శిరసావహించాడు.

తదనంతరం తన తోకను పెంచుకొని దాన్ని ఒక కోటలా రూపొం దించాడు. ఆ తోక కోటలో శకుంతుణ్ణి దాచి ఉంచాడు. ఆ కోట ఉపరి తలాన ఒక చిన్న కోతిలా తాను కూర్చున్నాడు. రామనామ జపం తీవ్రతరం చేయసాగాడు. ఆంజనేయుడి జిహ్వ, మనస్సు మధురమైన రామనామాన్ని మననం చేయసాగాయి.

ఈ లోపు రామలక్ష్మణులు తమ సైన్యంతో శకుంతుడి రాజ్యంలో ప్రవేశించారు. అంజన వద్ద శరణుకోరి శకుంతుడు అంజన వనంలో దాగి వున్నాడన్న సంగతి రాముడికి తెలిసింది. శ్రీరాముడు కోపంతో ఆ వనానికి వెళ్ళి శకుంతుడు దాగివున్న శైలశ్రేణులపై రామబాణాన్ని ప్రయోగించాడు. కాని ఏం ఆశ్చర్యం! ఆ రామబాణాలు లక్ష్యాన్ని ఛేదించక, శ్రీరాముడి పాదాల వద్దే వచ్చిపడ్డాయి. తల్లి పాదాలను చుట్టుకొనే పసి పాపలా బాణాలు దీనంగా తన పాదాలపై వ్రాలిన వింతను చూసి ఆశ్చర్య పోయిన శ్రీరాముడు కారణం తెలియరాక దిగ్భ్రమ చెంది ఉన్నప్పుడు నారద మహర్షి అక్కడికి వెళ్ళి మందహాసం చేస్తూ అసలు సంగతిని వివరించాడు. "శ్రీరామా! నీ నామ మహిమ నీ కంటే మిన్న, నీ శక్తి సామర్థ్యాలు నీ నామ మహిమ ఎరిగిన వారిని ఏమీ చేయజాలవు! నీ యుద్ధఘోషను కాస్త ఆపు! ఒక మహత్తర సత్యాన్ని నువ్వు ఎరుగవచ్చును".

వెంటనే యుద్ధఘోషలు ఆగిపోయాయి. ప్రశాంతతతో ఆ వనం ఆహ్లాద మొందినది. అప్పుడు, పిల్లగాలిలో మధుర కంఠస్వరంతో 'రామ్ రామ్' అనే సుమధుర నామం వినబడసాగింది.

రామనామ స్మరణను ఆలకించి శ్రీరాముడు ఆశ్చర్యపోతూ నారద మహర్షిని ఇలా అడిగాడు : "మహర్షీ! ఎవ్వరిదీ వాణి! ఎవ్వరిదీ మాధుర్య రసస్రవంతి! ఆహా ఇంత భక్తిపారవశ్యంతో నా నామాన్ని ఆంజనేయుడొక్కడే ఉచ్చరించగలడు. ఎక్కడున్నాడతడు! నా బాణాలను ఎదిరించినవాడు ఆంజనేయుడా? ఏమిటీ వింత! రామబాణానికి అపజయమా! నారద మునీంద్రా! జరిగినదేమిటో కాస్త వివరించండి".

అప్పుడు నారదుడు సావధానంగా ఇలా చెప్పాడు : "శ్రీరామా! ఆంజ నేయుడు తన తల్లి వాగ్దానాన్ని నెరవేర్చడానికి శకుంతుడికి ఆశ్రయం ఇచ్చి రక్షించాడు. నీ బాణాలను, నీ శక్తిని నీ నామంతోనే ఎదుర్కొన్నాడు. నీ శక్తి నీ నామ మహిమ ముందు ఓడిపోయింది. రాముడికంటే రామ నామమే మిన్న అని హనుమంతుడు నిరూపించాడు. రామా! అతణ్ణి అనుగ్రహించు!"

నారదుడి మాటలకు శ్రీరాముడు ఆనందించినా, తాను విశ్వా మిత్రుడికి ఇచ్చిన మాటను ఎలా చెల్లించుకోవాలో తెలియక ఆందోళనకు గురియైనాడు.

రాముడు పరిస్థితి నారదుడికి అర్థమైంది. వెంటనే శకుంతుని రప్పించి, విశ్వామిత్రుడి పాదాలపై అతడి శిరస్సు పడేటట్లు నమస్కరింప చేశాడు. తన పాదాలపై శకుంతుని శిరస్సు పడగానే విశ్వామిత్రుడు తన కోపతాపాలు వీడి, పరమానందం చెందాడు. రాముడు హనుమను కౌగిలించుకొని సంతోషపరవశుడైనాడు.

నారదుడు ఈ నాటకం ఆడి రామనామ ప్రభావాన్ని రాముడే కాక సర్వులూ ఎరిగేట్లు చేశాడు.

శ్రీ త్యాగరాజ స్వామి పాడిన రీతిలో మనమూ "నీ నామ రూపములకు నిత్యజయమంగళం" అని మంగళాంతంగా ఈ నామజప ప్రభావ వ్యాఖ్యానాన్ని ముగిద్దాం.





# మాతృసంస్థ కబుర్లు

జనవరి 18న రాష్ట్రీయ స్వయం సేవక సంఘం మల్కాజిగిరి విభాగ్ తరఫున ఏర్పాటు చేసిన రన్ 4 భారతమాత కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీ రామానంద ప్రభుజీవారు పాల్గొని ధర్మరక్షణ కోసం హిందువులందరూ సంఘటితం కావాలని తమ ఉపన్యాసంలో సెలవిచ్చారు. ఈ కార్యక్రమంలో వందల సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

జనవరి 24 నుండి 27 వరకు తిరుపతి శ్రీనివాస మంగాపురం శ్రీ వశిష్ఠాశ్రమ రజతోత్సవ కార్యక్రమంలో ఆశ్రమ పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ స్వామీ స్వరూపానందగిరి గారి ఆహ్వానం మేరకు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీ రామానంద ప్రభుజీవారు మరియు ఆశ్రమ ఇన్‌ఛార్జి మేనేజింగ్ ట్రస్టీ డా॥ చంద్రారెడ్డి గార్లు పాల్గొన్నారు.

జనవరి 29న అమావాస్య సందర్భంగా ఆశ్రమ గోశాలలో పరిసర గ్రామీణుల చేత గోపూజా కార్యక్రమం ఘనంగా జరిగింది.

ఫిబ్రవరి 2న సాయిధామం సేవాశ్రమ పరిసర గ్రామ వాస్తవ్యులు శ్రీ ముసలోజు బాలబ్రహ్మచారి, శ్రీమతి వరలక్ష్మి దంపతుల ఆహ్వానం మేరకు వారి కుమార్తె చి॥ల॥సౌ॥ చైత్ర మానస, చి॥ జస్వంత్‌ల వివాహ కార్యక్రమానికి హాజరై వధూవరులను స్వామీజీ ఆశీర్వదించారు.

ఫిబ్రవరి 24న సాయిధామం సేవాశ్రమానికి సమీప గ్రామమైన మూడు చింతలపల్లి వాస్తవ్యులు శ్రీ సదాశివరెడ్డి ఆహ్వానం మేరకు వారి గృహంలో నిర్వహించిన శతరుద్ర అభిషేక మహోత్సవంలో పాల్గొని తమ ఆశీస్సులు అందజేయటమైనది.

ఫిబ్రవరి 25న శ్రీ రామలింగేశ్వర దేవస్థానం, కీసరగుట్ట జాతర సందర్భంగా దేవస్థానం వారి ఆహ్వానం మేరకు మాఘ ద్వాదశి పర్వదినాన శ్రీ భవాని శివ దుర్గ సమేత రామలింగేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీ రామానంద ప్రభుజీ వారు పొందడమైనది. దేవాలయ కమిటీ సభ్యులు స్వామీజీ వారికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

మార్చి 1న శ్రీ సాయీ సేవా సమితి ట్రస్ట్ సభ్యులు గురుదేవుల ప్రేమకు పాత్రులైన శ్రీ బూర్లగడ్డ సాంబశివరావు, శ్రీమతి సులోచనమ్మ జ్యేష్ఠ పుత్రుడు శ్రీ గోపీకృష్ణ, సాయి మాధురి గార్లు నూతనంగా ప్రారంభించ నున్న శ్రీ సాయిబాబా జ్యూయలరీ షాపులో సాయిబాబా, గురుదేవుల చిత్ర పటాలను ఆవిష్కరించవలసిందని కోరటంతో శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీ రామా నంద ప్రభుజీవారు వారి కోరికను నెరవేర్చటమైనది.

మార్చి 3వ తేదీన కీసర మండలం పరిధిలోని తిమ్మాయిపల్లి గ్రామంలో జనహిత సేవా సంస్థ ఆశ్రమ ఆవరణలో శ్రీ విఘ్నేశ్వర, సుబ్రహ్మణ్య, దక్షిణామూర్తి, లక్ష్మణ సమేత సీతారాముల దేవతా మూర్తుల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో స్వామీజీ పాల్గొని, సంస్థ నిర్వహిస్తున్న పలు సేవా కార్యక్రమా లను అభినందిస్తూ తమ ఆశీస్సులను అందజేశారు.

మార్చి 6వ తేదీన ఆశ్రమ భక్తులు కోస్గి వాస్తవ్యులు శ్రీ శ్రీనివాసరెడ్డి, శ్రీమతి భారతి గార్ల కుమారుడు చి॥ జయప్రకాశ్‌రెడ్డి, చి.ల.సౌ. ప్రతిభా రెడ్డి వివాహ కార్యక్రమ మహోత్సవంలో పాల్గొని వధూవరులను ఆశీర్వ దించి, గృహస్థాశ్రమ ధర్మాన్ని తెలియజేశారు.

అనంతరం స్వామీజీని ఘనంగా సత్కరించి తమ భక్తిని చాటు కున్నారు.





